క్లుప్తంగా

పీవీఎల్‌కు కృతజ్ఞతలు



పీవీఎల్‌కు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న భోగేశ్వరరావు

కాళ్ల: సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని ఉత్తమ సేవలు అందించాలని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో కాళ్ల సొసైటీ అధ్యక్షుడు సుంకర భోగేశ్వరరావు పీవీఎల్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కాళ్ల సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడిగా మరొకసారి నియమించినందుకు పీవీఎల్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. పీవీఎల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా రైతులకు సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ప్రతిష్టను పెంచేలా రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలన్నారు.

సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు విష్ణు విద్యార్థి

సాక్షి, భీమవరం: సౌత్‌జోన్ హ్యాండ్ బాల్ పోటీలకు భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎస్.నూకరాజు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు బుధవారం విలేకరులకు చెప్పారు. ఇటీవల ఏలూరులోని హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన జేఎన్‌టీయూకే హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో నూకరాజు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 4వ తేది నుంచి 5 రోజుల పాటు తమిళనాడులోని పెరియార్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ పోటీల్లో నూకరాజు పాల్గొంటాడన్నారు. నూకరాజును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దశిక సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, పీడీ శ్రీనివాసరావు అభినందించారు.

బీవీ రాజు పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి



పార్కులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని బీవీ రాజు మున్సిపల్ పార్క్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. పార్క్‌కు వచ్చే వారికి కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. శానిటేషన్ మెరుగ్గా ఉండాలని, విద్యుద్దీకరణ చేసి ప్రజలను ఆకర్షించేలా తీర్చిదిద్దాలన్నారు. బీవీ రాజు కళాశాల యాజమాన్యం కలెక్టర్‌తో మాట్లాడుతూ సుమారు రూ.1.35 కోట్లతో బీవీ రాజు పార్కును అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఈ పార్కును ఐదేళ్లపాటు సీఎస్ఆర్ నిధులతో నిర్వహిస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, విష్ణు కాలేజి డైరెక్టర్ జె.ప్రసాదరాజు, విష్ణు ఉమెన్స్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

ఘనంగా తపాలా బీమా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం హెడ్ పోస్టాఫీస్ అధ్వర్యంలో జాతీయ తపాలా బీమా దినోత్సవాన్ని నిర్వహించారు. హెడ్ పోస్ట్‌మాస్టర్ అషీబాబు, కే పోషి మాట్లాడుతూ 1884లో ఈ తపాలా బీమా పథకం ప్రారంభించారని, ఎన్నో లక్షల మంది ఈ పథకంలో చేరారని, దీనిలో బోనస్ ఎక్కువగా ఉంటుందన్నారు. పోస్టల్ పథకాలలో ఈ పీఎల్ఐ ముందువరుసలో ఉందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పోస్టల్ బీమా పథకం ఎంతో ఉపకరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఏజెంట్ ఎస్వీ భాస్కర రాజును లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్ సత్కరించారు. పోస్టల్ శాఖ సిబ్బంది ఎల్.సత్యనారాయణ, సీహెచ్ లెనిన్‌బాబు పాల్గొన్నారు.

అలరించిన సినీ మ్యూజికల్ నైట్

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ వార్షికోత్సవాల్లో బుధవారం నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. జగన్నాథపు వెంకటేశ్వరరావు ఉరదాళ్ల పాలెం వారిచే భగవత్ పారాయణ, ప్రజాపిత బ్రహ్మకుమారి ఆధ్యాత్మిక ప్రవచనం, హైదరాబాద్ వారి ఆరుద్ర రాక్ బ్యాండ్ ఆర్కెస్ట్రా, రాజోలు వారిచే సినీ మ్యూజికల్ నైట్, ఎస్.భారతి హరికథ, రెండు రత్నములు నాటిక ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తి రంజని, సాయంత్రం 4 గంటలకు దేవి భాగవత ప్రవచనం, సాయంత్రం భక్తి రంజని, 7 గంటలకు పంచ రత్నములు కార్యక్రమాలు జరుగుతాయి.

భీమవరం సుందరీకరణకు ప్రత్యేక చర్యలు



భీమవరంలో మునిసిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: జిల్లా కేంద్రంగా అవతరించిన భీమవరం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి అన్ని చర్యలూ తీసుకున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చెప్పారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో పట్టణాభివృద్ధిపై మున్సిపల్ మునిసిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ గౌరు, టీపీఓ సీతారామయ్య, టీపీఎస్‌లు శాస్త్రి పార్థసారథితో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసుకోవడమేగాక పట్టణాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ఇప్పటికే భీమవరం పట్టణం విద్య, వైద్య, వ్యాపారరంగాల్లో అభివృద్ధి చెందుతోందని జిల్లా కేంద్రంగా 7 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణాన్ని తీర్చిదిద్దుతామన్నారు. పట్టణం జిల్లా కేంద్రంగా నడిబొడ్డున ఉండడంతో ప్రజలు తమ అవసరాలకోసం పెద్ద సంఖ్యలో వస్తుంటారన్నారు. అందువల్ల పట్టణంలో మౌలిక వసతులు కల్పించడమేగాక సుందరంగా, ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగానే ప్రస్తుతం పట్టణంలో పార్కులను అభివృద్ధిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. స్వచ్ఛ భీమవరంగా పట్టణాన్ని తీర్చిదిద్దడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అలాగే మున్సిపల్ అధికారులు కూడా చిత్తశుద్ధితో పట్టణ అభివృద్ధికి, సుందరీకరణకు కృషి చేయాలన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, భీమవరం: పేదల సొంతింటి కల నెరవేర్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం వీరవాసరం మండలం మత్స్యపురిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కమతాలపల్లికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లను పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ సొంతిల్లు కలిగి ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ పెద్దసంఖ్యలో ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమేగాక ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గతంలో వైఎస్సార్ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా తర్వాత అధికారం చేపట్టిన నాయకులు పేదలకు ఎక్కడా ఒక్క సెంటు స్థలం కూడా ఇవ్వలేకపోయారని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అయితే జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 30 లక్షల మందికి పైగా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారన్నారు. ఇంటి స్థలం ఇవ్వడంతోపాటు అంతేకాకుండా లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల నిధులు ఇవ్వడమే కాక బ్యాంకుల నుంచి రుణం పొందేలా చర్యలు తీసుకున్నారన్నారు. భీమవరం నియోజకవర్గంలో సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడంతో ఇప్పటికే అనేకమంది లబ్ధిదారులు వేగంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు సొంతింటి కల నిజం చేసుకోవాలని శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో వీరవాసరం తహసీల్దార్ ఎం.సుందర్‌రాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట భోగయ్య, చెల్లబోయిన సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే జగన్ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- ఆకివీడు 5వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



ఆకివీడు 4వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు: పేదరికం రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆకివీడు నగర పంచాయతీలోని సచివాలయం-2లో 5వ వార్డు, సచివాలయం-5లో 4వ వార్డులలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పీవీఎల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై అడిగి తెలుసుకున్నారు. పలు చోట్ల ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి జగన్ పరిపాలన చాలా బాగుందని, సంక్షేమంతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని పీవీఎల్‌కు, నాయకులకు చెప్పారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధితో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అన్ని వసతులతో స్వర్గధామంగా నిలిచిందని వివరించారు. పేదరికాన్ని రూపుమాపేందుకు సంక్షేమ పథకాల్ని ప్రతి ఇంటికీ అందజేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల చేయూతతో ప్రతి పేదవాడూ ఆర్థికంగా బలోపేతం అయ్యాడన్నారు. జగనన్న కాలనీలలో ఇళ్ల స్థల పట్టాలు, సొంత ఇంటి కల నెరవేరడంతో ప్రతి పేదవాడూ లక్షాధికారి అయ్యాడని పీవీఎల్ చెప్పారు. ప్రతి ఇంటిలోనూ చదువుకుంటున్న ప్రతి బిడ్డకూ జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో రానున్న రోజుల్లో ప్రతి ఇంటిలోనూ చదువుకున్న ప్రతి వ్యక్తికీ ఉన్నత ఉద్యోగం లభిస్తుందన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిని ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. రూ. 2.15 లక్షల వ్యయంతో ఇల్లు నిర్మించేందుకు కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నందున లబ్ధిదారులు స్పందించి వచ్చే వేసవిలోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు.

సమస్యల్ని పరిష్కరిస్తాం

ఆయా వార్డుల్లో వచ్చిన డ్రెయినేజీ, మంచినీరు, మంచినీటి చెరువుకు అవుట్‌లెట్ తదితర అంశాల్ని ప్రజలు పీవీఎల్ దృష్టికి తీసుకురాగా నగర పంచాయతీ పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో ప్రాధాన్యతా క్రమంలో ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను), వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, జగ్గురోతు విజయ్‌కుమార్, మోటుపల్లి గంగాధరరావు, వాడపల్లి జగన్, మోరా జ్యోతి, అంబటి రమేష్, జి.ధనరాజు, గుండా సుందర రామనాయుడు, ఎండీ.జక్కీ, పళ్లెం అరుణకుమారి, మన్నే లలితాదేవి పోతరాజు, ఎండీ.మదనీ, గుండుగొలను సావిత్రి, శిరపు శ్రీనివాస్, యర్రా కేశవరావు, తిప్పా దుర్గాభవాని, షేక్ హుస్సేన్, రుంకాని శ్రీ హరి, కుంచాడ బాబ్జీ, గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి మాధవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు




చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలను పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి పరిశీలించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి





అన్నసమారాధనలో పాల్గొన్న కవురు శ్రీనివాస్, శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారు

వీరవాసరం: ఆధ్యాత్మిక భావనను సమాజంలోని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. నవుడూరు జంక్షన్‌లో వేంచేసియున్న శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి వార్షిక దివ్య తిరుకళ్యాణ మహోత్సవాల్లో పాల్గొని బుధవారం ఆయన మాట్లాడారు. శ్రీసత్యనారాయణ స్వామివారికి కరుణా కటాక్షాలు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఘనంగా సత్యదేవుని కల్యాణం

శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివార్ల కల్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. స్వామివారికి స్నపన తిరుమంజనం, అంకురార్పణ, ధ్వజారోహణ, మండపారాధన, అగ్ని ప్రతిష్టాపన కార్యక్రమాలను చేపట్టారు. స్వామివారిని అమ్మవారిని పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తెలుగా అలంకరించి అనంతరం స్వామివారి దివ్యతిరు కల్యాణం వేడుకగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నసమారాధనలో 15 రకాల పిండివంటలను వండి వడ్డించారు. 10 వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వాడపల్లి సీతారామాచార్యులు, తిరుపతి రాము పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి విరాళం



వెంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీష్మ ఏకాదశి సందర్భంగా హౌసింగ్ బోర్డులోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వేకువ జామున స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. స్వామివారి శాశ్వత నిత్యపూజా పథకానికి పి.అర్జున్ రాజు దంపతులు రూ.25 వేలు, కర్మూరి ప్రవీణ రూ.25 వేలు విరాళం అందజేశారు. వీరికి ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు రసీదులను అందించారు. దాతలకు అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసచార్యులు వేద ఆశీర్వచనం పలికి స్వామివారి శేషవస్త్రం అందించారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు స్వామివారి శేష వస్త్రం రసీదులను అందించారు. కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, సరిపిడకల రామారావు, జానపాటి మధు, డాక్టర్ కార్తికేయ వర్మ, కడలి వెంకటేశ్వరరావు, కడలి ఫణి కుమార్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



చిలుకూరులో శంకుస్థాపన చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, టీటీడీ మాజీ సభ్యుడు రామరాజు

ఉండి : చిలుకూరులో వందేళ్ల నాటి కోదండ రామాలయం పునర్నిర్మాణానికి దేవదాయ శాఖ, గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో బుధవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, టీటీడీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గోకరాజు రామరాజు శంఖుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దేవదాయశాఖ సీజీఎఫ్ ఫండ్స్ రూ.90 లక్షల అంచనాలతో ఈ ఆలయం సుందరంగా నిర్మించనున్నట్లు పీవీఎల్ తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో వేగేశ్న వెంకటరామరాజు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర దేవదాయశాఖ తపతి నెహ్రూ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చేకూరి బోసురాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, మహంకాళి, ముదునూరి సీతారామరాజు, రుద్దరాజు బలరామరాజు, వేగేశ్న మూర్తిరాజు, రుద్దరాజు రామరాకృష్ణంరాజు, పెన్మెత్స భీమరాజు, కూనపరాజు రామకృష్ణంరాజు, అల్లూరి సుబ్బరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ అందజేత



ట్యాంకర్‌ను ప్రారంభించిన సర్పంచ్ చినకృష్ణమూర్తి

ఉండి: యండగండిలో శివారు ప్రాంతాలకు తాగునీరందించేందుకు మాజీ ఎమ్మెల్యే పెన్మత్స వెంకటనర్సింహరాజు పేరుతో ఆయన భార్య సత్యవతి, కుమారుడు చినరామకృష్ణంరాజు 2వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంకర్‌ను అందజేశారు. బుధవారం సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామం దాతల సహకారంతో మరింత అభివృద్ధి చెందుతోందన్నారు. కుళాయి నీరు చేరని ప్రాంతాలకు, సుదూర ప్రాంతాలకు ప్రస్తుతం దాతలు ఇచ్చిన ట్యాంకర్ సహాయంతో తాగునీరందిస్తామన్నారు. సచివాలయ అధికారులు, గ్రామ సంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి



మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

పాలకోడేరు: బీసీ కులాలంతా ఒక తాటి పైకి రావాల్సిన సమయం ఆసన్నమైందని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ప్రధాన అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. అసోసియేషన్ సమావేశాన్ని శృంగవృక్షం మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ కులాల గణన వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు వెంటనే కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీలకతీతంగా బీసీల ఐక్యతను చాటేలా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ పాలకోడేరు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చేబోలు రామకృష్ణ, బూరాబత్తుల సత్యనారాయణ, గుంటపల్లి శ్రీనివాసరావు, మండల అధ్యక్షులుగా దొమ్ముటి వేణుగోపాలం, ఉపాధ్యక్షులుగా నేతల గోపి, ప్రధాన కార్యదర్శిగా చేబోలు రమేష్, కార్యదర్శిగా దేవాని సత్యనారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శిగా గులిపల్లి వెంకట పాండురంగారావు, వనమరాజు, నందం సత్యనారాయణ, కోశాధికారిగా పాలా శ్రీధర్‌ను ఎన్నుకున్నారు. సభాధ్యక్షులు దొంగ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షులు చింతాడ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు కుక్కల సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సాక్షి, భీమవరం: భీమవరం బస్‌స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపారు. మృతుడికి సుమారు 50 ఏళ్లు ఉంటాయని తెలిపారు. మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మట్టి లారీల సీజ్

కాళ్ల: కృష్ణా జిల్లా నుంచి ఎలాంటి అనుమతుల్లేకుండా పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్న టిప్పర్ లారీలను సీజ్ చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. మండలంలో పెద్ద ఎత్తున మట్టి వ్యాపారం సాగుతుంది. ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అక్రమంగా బొండు ఇసుక తరలిస్తున్న 8 టిప్పర్ లారీలను సీజ్ చేశామన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

సాక్షి, భీమవరం: విద్యార్థులు చెడు అలవాట్లను దరి చేరనీయవద్దని అమెరికాలోని ఇంగల్లాస్ మెమోరియల్ యూనివర్సిటీ ఆఫ్ షికాగో మెడికల్ సెంటర్ ఫ్యామిలీ మెడిసిన్ ఎండీ డాక్టర్ జి.గణపతిరాజు అన్నారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం జనరల్ మెడిసిన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. గణపతిరాజును కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు సత్కరించారు. ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆర్ కృష్ణ చైతన్య, ఎన్వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డులో పింఛన్ల పంపిణీ

సాక్షి, భీమవరం: పట్టణంలోని 13వ వార్డులో బుధవారం లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ సచివాలయ కన్వీనర్ గంటా అనితారాణి ప్రారంభించారు. ఉదయం 5 గంటలకే సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.ప్రభాకర్, వలంటీర్ సుజిత ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా అనితారాణి మాట్లాడుతూ పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రికి అండగా ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గంటా సుందరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రారంభం

పాలకోడేరు: మాజీ సర్పంచ్, దాత చింతలపాటి సూర్యనారాయణరాజు సేవలు, సహకారం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. గరగపర్రులో చింతలపాటి కృష్ణంరాజు, వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యనారాయణరాజు, కాంతమ్మ దంపతులు నిర్మించిన బస్టాండ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు దంపతులను, వారి కుమారులు రమేష్ రాజు, సురేష్ రాజు అందిస్తున్న సేవలను అభినందించారు. అధునాతన సౌకర్యాలతో బస్టాండ్ నిర్మించడంతోపాటు సీసీ కెమెరాలు కూడా రక్షణగా ఏర్పాటు చేశారు. ఉప సర్పంచ్ వీరవల్లి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి కానూరి రాజేష్, వీఆర్వో స్వామి నాయుడు, చింతలపాటి బలరామరాజు, రామరాజు పాల్గొన్నారు.

త్వరలో రజకులతో భారీ సమావేశం



లోగిడి జయన్నను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): త్వరలో విజయవాడలో రజకులతో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ లోగిడి జయన్న చెప్పారు. రజక బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గొగిరాజును భీమవరంలో మంగళవారం రాత్రి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం భీమవరం రజక టౌన్ అధ్యక్షుడు చింతాడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో లోగిడి జయన్నకు గౌరవ సత్కారం అందించారు. జయన్న విలేకరులతో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో రజకులకు పెద్దపీట వేశారని, చేదోడు పథకం కింద రజకులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందిస్తుండటం అభినందనీయమన్నారు. చింతాడ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నేతృత్వంలో రజక సంఘాలు, వృత్తిదారులు వైఎస్సార్ సీపీకి మద్దతుగా ఉన్నారన్నారు. న్యాయవాది బేతపూడి లోకేష్, రజక సంఘం నాయకులు నడిపూడి నాగబాబు, మీడియా సెక్రెటరీ అమనాపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అల్లూరి ముని మనవడికి సన్మానం

పాలకోడేరు: పాలకోడేరు శివారు ప్రాంతంలో జరుగుతున్న గోస్తని నది తీర్థోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు ముని మనవడు శ్రీరామరాజుని ఘనంగా సత్కరించారు. గోస్తనీ ప్రాంతంలోని రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

పాలకోడేరు: బంధువులే అయినప్పటికీ పెద్దలు అంగీకరించకపోవడంతో పెళ్లి చేసుకుని పోలీసులను ఆశ్రయించిందో ప్రేమజంట. పాలకోడేరు హెచ్‌సీ ధనంజయ కథనం ప్రకారం కుముదవల్లికి చెందిన కె.జోసెఫ్ ఇటీవలే దుబాయ్ నుంచి వచ్చాడు. భీమవరం మండలం నడిపల్లి బేతపూడి గ్రామానికి చెందిన నేతల దివ్య రాజకుమారి భీమవరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా చేస్తోంది. వీరిద్దరూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరు బంధువులే అయినప్పటికీ దివ్య తల్లిదండ్రులు వీరి పెళ్లికి ఒప్పుకోలేదు. దీంతో బుధవారం గునుపూడి చర్చిలో పెళ్లి చేసుకుని పోలీసులను ఆశ్రయించారు. ఇద్దరూ మేజర్లు కావడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి అబ్బాయి తల్లిదండ్రులకు అప్పగించారు.

రైల్వే ట్రాక్ వద్ద మంటలు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధిలోని రైల్వేట్రాక్ సమీపంలో బుధవారం మంటలు వ్యాపించాయి. పొదల నుంచి మంటలు చెలరేగడంతో పక్కనే ఉన్న రైల్వే కేబుల్స్‌కు మంటలు వ్యాపించకుండా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.